ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

మంగళవారం 28 జనవరి 2025

కూచిపూడిలో 'ఉజ్వల' ప్రదర్శన 6లో

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ
- పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రదర్శనలు
- పలువురికి నృత్య శిక్షణ



రామగుండం ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలక వర్గ పదవీకాలం ముగియడంతో కలెక్టర్‌ను ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా నియమించింది. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ అరుణశ్రీ, రామగుండం ఈఈ రామన్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


మంథని, (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ చైర్మన్, పాలక వర్గం పదవీ సమయం ముగియడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జడల అరుణశ్రీని స్పెషల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నిమించింది. పాలకవర్గం ఏర్పాటయ్యే వరకు మున్సిపల్ ప్రత్యేకాధికారి పాలన కొనసాగనుంది.

ఎంపీడీవో కార్యాలయం మార్పు

పెద్దపల్లి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత కార్యాలయ ఆవరణను బస్ డిపోకు కేటాయించడంతో ఎంపీడీవో కార్యాలయం, ఈజీఎస్ కార్యాలయాన్ని మార్చామని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

స్థానిక ఎన్నికలకు తప్పని నిరీక్షణ!

- ఇంకా ఎటూ తేలని రిజర్వేషన్లు
- నివేదిక ఇవ్వని బీసీ డెడికేషన్ కమిషన్
- మరో మూడు, నాలుగు మాసాలు ఆగాల్సిందే
- మార్చి నెలాఖరు వరకు సంక్షేమ పథకాలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఆశావాహులకు మరో మూడు, నాలుగు నెలల పాటు నిరీక్షణ తప్పేలా లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల అమలును మార్చి నెలాఖరు వరకు అమలు చేసే విధంగా ఆదేశాలు ఇచ్చింది. అలాగే బీసీ రిజర్వేషన్లకు సంబంధించి నియమించిన డెడికేటెడ్ కమిషన్ ఇప్పటివరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించ లేదు. దీంతో ఇప్పట్లో రిజర్వేషన్ల లెక్క తేలే అవకాశాలు లేకపోవడంతో గ్రామపంచాయతీ, మండల జిల్లా పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకా శాలు కనబడుతున్నాయి.

● ఎక్కడి సమస్యలు అక్కడే

ప్రస్తుతం పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాల నలో కొనసాగుతున్నాయి. ఏడాదిగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే మూలుగుతున్నాయి. గ్రామాల అభివృద్ధికి కేం ద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదిగా విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పాలకవర్గాలు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ప్రత్యే క అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల నిర్వ`హణ అస్తవ్యస్తంగా మారింది. అలాగే మండల జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం కూడా జూలైలో ముగి`సింది. వీటికి కూడా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. తాజాగా మునిసిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది.

● రిజర్వేషన్ల ముడిపడిన ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలు రిజర్వేషన్లతో ముడిపడి ఉన్నాయి. గత ఎన్నికల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉన్నాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించిన మేరకు అదేవిదంగా రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చింది. ఆ మేరకు సమగ్ర కుటుంబ, విద్య, ఉపాధి, ఆర్థిక, కుల గణన సర్వేను ప్రభుత్వం నవంబర్ నెలలో నిర్వహిం చింది. ఆ సర్వేను కూడా పూర్తి చేసి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేశారు. దీని ఆధారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను తేల్చేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేషన్ కమిషన్‌ను ప్రభుత్వం నియమిం చింది. ఈ కమిషన్ నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉమ్మడి జిల్లాలు పర్యటించి ఆయా వర్గాలు, సంఘాలు, ప్రజాప్రతినిధుల ద్వారా వివరాలను సేకరించింది. ఈ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉన్నది. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయని ఆశించినప్పటికీ, పరిస్థితులు అందుకు అనుకూలంగా కనబడడం లేదు.

● సంక్షేమ పథకాలు ఇలా..

గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకాల కోసం ఇప్పటికే లబ్ధిదారులను

మిగతా 8వ పేజీలో...

● ఆశావహుల ఎదురుచూపులు

ఫిబ్రవరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫి కేషన్ వెలువడుతుందని ఆశావహులు ఎదురుచూ స్తున్నారు. ఇప్పటికే వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను ఆకట్టుకునేందుకు కార్యక్రమాలు చేస్తు న్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదలైన ఎన్ని కల నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అధికార యం త్రాంగం ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంది. రిజర్వేషన్ల లెక్క తీరకపోవడంతో ఎన్నికల నిర్వహణ మరింత జాప్యం అవుతున్నది. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తోంది.

ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

- 9,885 మంది రైతులకు రూ.10.13 కోట్లు

పెద్దపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం నుంచి ప్రభుత్వం ప్రారంభించిన రైతు భరోసా కింద 13 గ్రామాల్లో 16,595.6 ఎకరాల భూముల పట్టాదారులు 9,885 మంది రైతుల ఖాతాల్లో 10 కోట్ల 13 లక్షల 73 వేల 344 రూపాయలు సోమవారం జమయ్యాయి. ఈ పథకాన్ని జిల్లాలోని పదమూడు రూరల్ మండలాల్లో ఎంపిక చేసిన ఒక్కో గ్రామంలో ఉన్న రైతులందరికీ ఎకరానికి రూ.6 వేల చొప్పున జమ చేశారు. అంతర్గాం మండలం మద్దిర్యాల గ్రామానికి చెందిన 295 మంది రైతుల ఖాతాల్లో రూ.39లక్షల 25వేల921, ధర్మారం మండలం కటికెనపల్లిలో 1773 మంది ఖాతాల్లో కోటి 77 లక్షల77వేల 565 రూపాయలు జమ అయ్యాయి. ఎలిగేడు మండలం శివపల్లిలో 499 మంది ఖాతాల్లో రూ.63లక్షల 60వేల428, జూలపల్లి మండలం కోనరావుపేటలో 1388 మంది రైతులకు కోటి 30 లక్షల 7 వేల 53 రూపాయలు, కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో 717 మంది రైతుల ఖాతాల్లో రూ.63 లక్షల 9వేల196 జమ అయ్యాయి. మంథని మండలం అడవిశ్రీరాంపూర్‌లో 420 మంది రైతుల ఖాతాల్లో రూ.41 లక్షల 71వేల557, ముత్తారం మండలం మచ్చుపేటలో 328 మంది రైతుల ఖాతాల్లో రూ.38 లక్షల 25 వేల 533, ఓదెల మండలం శానగొండలో 840 మంది ఖాతాల్లో రూ.93 లక్షల 72వేల973, పాలకుర్తి మండలం రామారావుపల్లిలో 1570 మంది రైతుల ఖాతాల్లో కోటి 62 లక్షల 75 వేల 695 రూపాయలు జమ అయ్యాయి. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో 288 మంది రైతుల ఖాతాల్లో రూ.30 లక్షల 63 వేల 96, రామగిరి మండలం రత్నాపూర్‌లో రూ.18 లక్షల 53 వేల 208, కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లిలో 911 మంది రైతులకు రూ.96 లక్షల 70 వేల 661, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో 606 మంది ఖాతాల్లో రూ.57 లక్షల 60 వేల 458 రూపాయలు జమ చేసిందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న మాజీ కార్పొరేటర్లు

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్లు కార్పొరేషన్ నుంచి పొందిన మొబైల్ ఫోన్లను తిరిగి అప్పగిస్తున్నారు. కార్పొరేటర్, కోఆప్షన్ సభ్యులకు కార్పొరేషన్ మొబైల్ ఫోన్లు, సిమ్‌లను అప్పగించింది. ఈ నెల 26తో వారి పదవీ కాలం పూర్తయ్యింది. పదవీ కాలం పూర్తికాగానే తిరిగి అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సోమవారం మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగంకు అప్పగించారు.

ఐ ఫోన్లు ఎక్కడ : నగరపాలక సంస్థలో రెండు ఐ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేశారు. ఇవి అప్పటి ఒక మున్సిపల్ ప్రజాప్రతినిధి, ఒక అధికారి పేర బిల్లులు రికార్డు చేశారు. సుమారు రూ.3లక్షల వరకు బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఎక్కడ ఉన్నాయనేది ప్రశ్నార్థంగా మారింది.

ఎన్టీపీసీ స్టేజ్2కు నేడు ప్రజాభిప్రాయ సేకరణ

- టీటీఎస్ జడ్పీ స్కూల్ మైదానంలో ఏర్పాట్లు - వెయ్యి మంది పోలీసుల మోహరింపు - వేదిక వద్ద ఐదంచెల బందోబస్తు
- ప్రాంతాల వారీగా ట్రబుల్ మాంగర్ల జాబితా - రంగంలోకి కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థలు



మ్యాప్‌ను పరిశీలిస్తు బందోబస్తుపై సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్‌ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) రెండో దశకు సంబంధించి మంగళవారం పర్యావరణ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తోంది. టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సేకరణ కొనసాగుతుంది. ఎన్టీపీసీ రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నది. స్టేజ్ 1 కింద 2016లో 1600 మెగావాట్ల రెండు యూనిట్ల నిర్మాణం పూర్తయి ఉత్పత్తి చేస్తున్నాయి. మిగతా 2400 మెగావాట్లు నిర్మించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి కీలకమైన పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. మూడు వేల మందికి సరిపడే విధంగా జెడ్పీ గ్రౌండ్‌లో షామియాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చే వారి కోసం యాజమాన్యం భోజన వసతిని కల్పించింది.

కోల్‌సిటీ/జ్యోతినగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణపై పోలీస్‌లు నిఘా పెట్టారు. లగిచర్ల ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన రాష్ట్ర పోలీస్ శాఖ ఎన్‌టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణను సీరియస్‌గా తీసుకుంది. రామగుండం సీపీ, ఐజీ శ్రీని వాస్‌ను రంగంలోకి దింపింది. విపక్షాలు ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుం టామని ప్రకటించాయి. కమిషనరేట్ పరిధిలోని సుమారు వెయ్యి మంది పోలీస్ బలగాలను మోహరించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాకు చెందిన డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ, సివిల్, ఏఆర్, అన్నీ విభాగాలను రంగంలోకి దించింది. ప్రజాభిప్రాయ సేకరణకు ఐదంచెల బందోబస్తును ఏర్పాటుచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల రక్షణతోపాటు సభలో ఆందోళనలు, గొడవలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. మూడు వేల ప్రజలు హాజరవుతారని అంచనా వేయగా వెయ్యి మందితో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 785 మందిని విధుల్లో నియమించారు. సోమవారం సాయంత్రం పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచనలు చేశారు. మాతంగి కాలనీలోని ఫంక్షన్‌హాల్‌లో బందోబస్తుపై వ్యూహాన్ని వివరించారు. సమావేశ ప్రాంతం, డయాస్‌ల వద్ద ఒక్కొక్క ఏసీపీని కేటాయించి ఐదుగురు సీఐలు, 15మంది ఎస్‌ఐలను అటాచ్ చేశారు. డయాస్‌పై ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పికెట్ ఏర్పాటు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో అప్ర మత్తంగా ఉండాలని, సంయమనం పాటించాలని సీపీ సూచన చేశారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉన్నా అదుపులోకి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

రంగంలోకి కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్

ఎన్‌టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఇంటెలిజెన్స్ విభాగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌టీపీసీ ప్రభావిత, పరిసర ప్రాంతాలు, గ్రామాల్లో పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ప్రజల నాడి ఏ విధంగా ఉందనే వివరాలను సేకరిస్తున్నారు. సభలో ఆందోళనలకు ఎవరైనా ప్రణాళికలు చేస్తున్నారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

వెయ్యి మందితో భారీ బందోబస్తు...

ఎన్‌టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో పోలీసులు 800మందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి 785మందికి విధులు అప్పగించారు. ఐదుగురు ఏసీపీలు, 25మంది సీఐలు, 48మంది ఎస్‌ఐలు, 13 మంది మహిళా ఎస్‌ఐలు, 58మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 393మంది కానిసేబుళ్లు, 145మంది మహిళా కానిస్టేబుళ్లు, 62మంది హోంగార్డులు, 38మంది మహిళా హోంగార్డులను విధులకు కేటాయించారు. ప్రజాభిప్రాయ సేకరణకు ఐదంచెల బందోబస్తును ఏర్పాటు చేశారు.

ట్రబుల్ మాంగర్ల వివరాల సేకరణ

ఎన్‌టీపీసీ ప్రభావిత ప్రాంతాలైన రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్ మండలాల్లోని గ్రామాలు, డివిజన్లలో పోలీసులు ట్రబుల్ మాంగర్ల వివరాలు సేకరిస్తున్నారు. ఎన్‌టీపీసీతో ప్రస్తుతం ప్రభావితమవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మాతంగికాలనీ వాసులు అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో ఆ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎల్కలపల్లి, రాణాపూర్, లక్ష్మీపురం, మల్యాపూర్, కుందనపల్లి, రాజాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే ఎన్‌టీపీసీ వల్ల తీవ్ర ప్రభావిత మవుతున్నాయి. ఆయా ప్రాంతాల మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకుల కదలికలపై దృష్టి పెట్టారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బంద్

ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో బీఆర్ఎస్, ప్రభావిత గ్రామాలు, కాలనీల ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. భూనిర్వాసితులకు న్యాయం చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన సౌకర్యాలు

మిగతా 8వ పేజీలో...

ఒకే భూమి... డబుల్ రిజిస్ట్రేషన్

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గొడవకు దిగిన యజమాని
- వెనుక నుంచి వెళ్ళిపోయిన సబ్ రిజిస్ట్రార్



సబ్ రిజిస్టర్ కార్యాలయం

పెద్దపల్లిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఒకే సర్వే నంబర్ భూమి డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాఘవాపూర్ శివారులోని సర్వే నంబర్ 1116/1/4లో ఎకరా ఎడు గుంటల భూమి గోదావరిఖనికి చెందిన బోగే శ్రీనివాస్ చెందినది. గతేడాది జూలై 19న భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. రిజిస్ట్రేషన్ కన్నా ముందు భూమి మొత్తానికి నాలా కన్వర్షన్ చేసి 4804.93 గజాల్లోకి డాక్యుమెంట్ రైటర్ దస్తగీర్ ద్వారా మార్చారు.

అనంతరం గతేడాది అక్టోబర్‌లో బోగే శ్రీనివాస్ అందులోంచి 700 పైచిలుకు గజాలు మరొకరికి రిజిస్ట్రేషన్ చేసేందుకు రైటర్ దస్తగీర్ ద్వారా డాక్యుమెంట్ తయారు చేశాడు. మూడు నెలలపాటు డాక్యుమెంట్ పెండింగ్ ఉన్న అనంతరం శనివారం రిజిస్ట్రేషన్ చేశాడు. విషయం భూమి యజమాని (రియల్ ఎస్టేట్ వ్యాపారి)కి తెలిసి దస్తావేజు లేఖరితో గొడవకు దిగాడు. డాక్యుమెంట్‌ను పరిశీలించగా గతంలో తీసుకున్న నాలా కన్వర్షన్ ఆర్డర్ కాపీలో ఉన్న గ్రాంటెడ్ నంబర్ 1.0700ను దిద్ది 0.0645 రాసినట్లు ఉంది. ఈ తతంగం సబ్ రిజిస్ట్రార్‌కు తెలిసి జరిగిందా.. డాక్యుమెంట్ రైటర్ కావాల్సి చేశాడో తెలియదు. డాక్యుమెంట్ నంబర్ 158/2025 సబ్ రిజిస్టార్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం బయటకు తెలిసి సోమవారం విలేకరులు సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నించగా కార్యాలయం వెనుక నుంచి కారెక్కి వెళ్ళిపోయాడు. ఈ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో లక్షల రూపాయల చేతులు మారినట్లు సమాచారం.

కాగా ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ అశోక్‌ను వివరణ కోరగా డాక్యుమెంట్‌ను పరిశీలించలేదు. ఇరువర్గాలు మాట్లాడుకొని వస్తే ఒకరి డాక్యుమెంట్ తొలగిస్తానని పేర్కొన్నాడు.

సార్ గ్రామాల్లో ఉండలేకపోతున్నాం..

ఎంపీడీవోకు మొరపెట్టుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఎంపీడీవోకు మొరపెట్టుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కాల్వశ్రీరాంపూర్,జనవరి27,(ఆంధ్రజ్యోతి): సార్ మేము గ్రామాల్లో ఉండలేకపోతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం ఎంపీడీవోకు మొరపె ట్టుకున్నారు. రైతు ఆత్మీయ భరోసా ఎంపికలో పేర్లు రానివారు దూషిస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎంపీడీవో ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మీకు ఇష్టమైన వారి పేర్లనే రైతు ఆత్మీయ భరోసాలో ఎంపిక చేశారని, మేము కూడా ఉపాధిహామీ కూలీకి పోయామని ఎందుకు ఎంపిక చేయలేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎంపీడీవో రామ్మోహనచారి మాట్లాడుతూ 2023-24లో ఉపాధి హామీలో 20రోజులు పని చేసిన వారి పేర్లనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఆన్‌లైన్ ద్వారానే ఎంపిక చేశామని, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసాలో ఎంపికైన వారికి భూమి లేదన్నారు.

ఎంపికైన వారి కుటుంబ సభ్యుల పేరుమీద భూమి ఉన్నప్పటికీ 20రోజులు ఉపాధి పని చేసిన వారి పేరుపై భూమిలేని కూలీలనే ఎంపిక చేశారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను, మెట్లను దూషించిన, ఇబ్బందులు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఏమైన అను మానాలు ఉంటే కార్యాలయానికి వచ్చి తెలుసుకోవచ్చన్నారు.

గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు

● 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం ● 30 లీటర్ల సారా స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, గుంటపల్లిచెరువు తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శైలజ ఆధ్వర్యంలోని అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 30 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి పదిమంది అనుమానితులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట బైండోవర్ చేశామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. బైండోవర్లను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రణీత్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, రాజు, మల్లేశ్, కిషోర్‌కుమార్, కృష్ణకాంత్, యోగివర్మ, సర్దార్‌అలీ, శంకర్, సుమన్, రాకేశ్, సాయికృష్ణ, లలిత, రూప పాల్గొన్నారు.


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పురుగుల మందు తాగి కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన వర్స రాములు (55) అనే కూలీ పురుగులమందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో రాములు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కుటుంబీకులు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఉరివేసుకొని..

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో నాగెపల్లి శంకర్(45) ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా క్షౌరవృత్తిని మానేసి తాగుడుకు బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెరట్లో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

గంగాధర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు వరద కాలువ దగ్గర రోడ్డు పక్కన 30 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తిగా అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళ ముఖంపై రక్తపు మరకలు ఉండగా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు.


మహిళ మృతదేహం

చెరువులో మృతదేహం గుర్తింపు

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామ రెవెన్యూ శివారులోని ఎర్రకుంట చెరువులో 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో సోమవారం లభ్యమైంది. మృతుడి ఒంటిపై కాఫీ రంగు నైట్ ప్యాంట్, ఎరుపు, గోధుమ రంగు డబ్బాలు డిజైన్‌తో ఉన్న షర్టు ధరించి ఉన్నట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు అటు వైపు వెళ్లగా చెరువులో మృతదేహం కనిపించిందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదీ హత్యా...ఆత్మహత్యా..? ఎన్ని రోజుల క్రితం సంఘటనా జరిగింది? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహంను గుర్తు పట్టిన వారు ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి ఫోన్ నెం. 8712656817, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఫోన్ నెం. 8712656826 అనే నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

రాష్ట్ర మహాసభల్లో సీపీఎం నాయకులు


రాష్ట్రసభల్లో పాల్గొన్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు కరీంనగర్ నుంచి జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, కోనేటి నాగమణి, జిల్లాకార్యక్రమాల రిపోర్టును కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి ప్రవేశపెట్టారు.

రేపు వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష

గణేశ్‌నగర్ : వేసవిలో విద్యుత్ సరఫరాపై బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వ హించనున్నారు. నగరంలో కరీంనగర్ సర్కిల్ నోడల్ అధికారి అన్నపూర్ణాదేవి సర్కిల్ ఎస్‌ఈ సమక్షంలో చర్చించనున్నారు.

కూచిపూడిలో 'ఉజ్వల' ప్రదర్శన

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ
- పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రదర్శనలు
- పలువురికి నృత్య శిక్షణ

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వల కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. కళల పట్ల ఉన్న ఆసక్తితో కూచిపూడిలో డిప్లమాతో పాటు మాస్టర్స్ చేసి కళాకారులకు శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలిచ్చి అవార్డులు, ప్రశంసలు అందుకుంటోంది.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుమ్మడి పెద్దులు-నిర్మలాదేవి కూతురు ఉజ్వల. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తితో డిగ్రీ చదువుతూనే గురువుమేదరి నర్సయ్య వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందింది. ఆయన ప్రోత్సాహంతో మంథని సంగీత, నృత్య కళాశాలలో డిప్లోమా పూర్తి చేసింది. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో మాస్టర్స్ పూర్తి చేసి అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నది. తాను నేర్చుకున్న కళను పలువురికి నేర్పించాలనే సంకల్పంతో నృత్య శిక్షణ కేంద్రాన్ని 2014లో స్థాపించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దుతోంది.


కూచిపూడి నృత్యప్రదర్శనలో ఉజ్వల

● ఎన్నో అవార్డులు...ప్రదర్శనలు...

ఉజ్వల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నది. నేటికి కేంద్ర సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీశైలం, బాసర, వేముల వాడ, తదితర దేవాలయాల్లో, మహాశివరాత్రి, దసరా ఉత్సవాల్లో నృత్య హారతి ఇస్తోంది. 2019లో స్వచ్ఛభారత్ రామగుండం కార్పొ రేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉజ్వల ఎన్నికైంది. ఇటీవల హైదరాబాద్‌లో బుక్ ఫెడరేషన్ కార్య క్రమం, ఘంటసాల శతజయంతి ఉత్సవంలో ఉజ్వల ప్రదర్శన ఇచ్చారు. 2014లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తొలిసారి తెలంగాణ నుంచి సుకూన్ ఫెస్టివల్‌లో ఉజ్వల కూచిపూడి నృత్య ప్రదర్శనిచ్చి ఆకట్టుకుంది.


అవార్డు అందుకుంటున్న ఉజ్వల


గుమ్మడి ఉజ్వల

● పాఠశాలల్లో నేర్పించాలి

తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో కళను ఒక విద్యగా అందించాలని, కళల పట్ల అవగాహన కల్పించాలని కళా ఉజ్వల ప్రాజెక్టుతో మరో అడుగు ముందుకు వేసింది. ఈ ప్రాజెక్టుతో కళను నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసంపై చైతన్యం తీసుకురావడంతోపాటు ఉపాధి, అభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందుకోసం ప్రయత్నం చేస్తున్నానని ఉజ్వల తెలిపారు.

నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించండి!

● ప్రజావాణిలో ప్రభుత్వానికి మిడ్ మానేరు నిర్వాసితుడి దరఖాస్తు ● వ్యవస్థపై నమ్మకం పోయిందన్న చల్లా బాలరాజు

సిరిసిల్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల్ని నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఓ సంచలన దరఖాస్తు వచ్చింది. తనకు నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించాలంటూ ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వానికే దరఖాస్తు చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన చల్ల బాలరాజు ఈ వినతిపత్రం సమర్పించారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో తమ కుటుంబం 4.50 గుంటల స్థలం, అందులో 1.50 గుంటల్లో ఉన్న ఇంటిని కోల్పోయిందని తెలిపారు. నిర్వాసితుడిగా ఇంటికి సంబంధించి పరిహారాన్ని రూ.16 లక్షలుగా నిర్ణయించారని, ఇందులో రూ.3.09 లక్షల పన్ను మినహాయించి మిగిలింది ఇచ్చారని పేర్కొన్నారు. కానీ, మిగిలిన 3గుంటల స్థలానికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం కింద ఇంటి స్థలాన్ని తాము కోరుకున్న గ్రామంలో కాకుండా మరో గ్రామంలో ఇచ్చారని తెలిపారు. అందుకు కూడా తాము అంగీకరించినా.. ఆ స్థలాన్ని సైతం వెనక్కి తీసుకుని.. నివాసయోగ్యం కాని బండరాళ్లున్న మరో స్థలం ఇచ్చారని వాపోయారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా.. అధికారులు భూసేకరణ చట్టాలను అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయకుండా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యుడైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలంటూ బాలరాజు గతేడాది జనవరిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడంతో గతేడాది జూన్‌లో హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 24న హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మరోసారి వినతిపత్రం ఇచ్చారు. తనకు చట్టాలపై, న్యాయవ్యవస్థపై నమ్మకం పోయిందని అందులో పేర్కొన్నారు. అలాంటి అధికారులను కొట్టడం, తిట్టడం చట్ట విరుద్ధమైనందున.. నక్సల్స్‌లోకి వెళ్లి ప్రజాకోర్టులు ఏర్పాటు చేసి పేదలకు, సామాన్యులకు, నిరక్షరాస్యులకు న్యాయం చేయాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. అందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి దీనిని పరిశీలించి.. బాలరాజు సమస్యను పరిష్కరించాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కాగా, బాలరాజు మరోసారి ఇదే విజ్ఞప్తితో సోమవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి హాజరై వినతిపత్రం ఇచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో ఐదు నెలల జైలు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చిట్టపురం పోషన్న(58) అనే వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2019 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటి పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవే శపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాడిపల్లి గ్రామానికి చెందిన మామిడాల రవీందర్‌రెడ్డి(53) తన పొలంలో కూరగాయల సాగు కోసం నారు తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై మొలంగూర్‌కు వెళ్లి నారుతీసుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సింగాపూర్ గ్రామ శివారులోని పెద్ద గుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్‌రెడ్డి కిందపడిపోయాడు. కిందపడిన రవీందర్‌రెడ్డి శరీరంపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై పరిశీలన జరిపారు. మృతుడు మాందాడిపల్లి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

● ఒకరి పరిస్థితి విషమం

హుజూరాబాద్ మండలంలోని రాంపూర్-జూపాక గ్రామ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాంపూర్ గ్రామానికి చెందిన మాడుగుల శ్రీనివాస్‌తో పాటు జూపాక గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాయ్యాయి. ఈ ప్రమాదంలో మాడుగుల శ్రీనివాస్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇల్లంతకుంట నుంచి ద్విచక్రవాహనంపై కముటం శృతి, ఇట్టిరెడ్డి పద్మ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకనుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శృతి, పద్మ గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడి

ముత్తారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంథని రాజక్క అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన బంధువు మంథని వంశీ మద్యం మత్తులో ఆదివారం రాత్రి దాడి చేశాడు. సమ్మక్క వంశీ ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి మద్యం సేవించగా మాటామాట పెరిగి సమ్మక్కపై వంశీ కర్రతో దాడి చేశాడు. గొడవను ఆపేందుకు మంథని రాజక్క అడ్డు రాగా రాజక్కకు గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

జమ్మికుంట సీఐపై విచారణ

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవికుమార్ ఓ అట్రాసిటీ కేసు విషయంలో మధ్యవర్తి వద్ద ముడుపులు తీసుకున్నారని ఎదుర్కొంటున్న ఆరోపణలపై హుజూరా బాద్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. అట్రాసిటీ కేసు విషయంలో రూ. 3లక్షల నగదును మధ్య వర్తి షేక్ సాబీర్ అలీ ద్వారా బాత్‌రూం బకెట్లో పెట్టించి సీఐ తీసుకు న్నాడని, వారి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడి యో రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. విచారణకు హాజరు కావాలంటూ షేక్ సాబీర్ అలీకి రెండ్రోజుల క్రితం పోలీసులు నోటీసులు అందజేయగా, హుజూరాబాద్ ఏసీపీ కార్యాల యంలో పోలీసు అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సీఐ తన వద్ద తీసుకున్న డబ్బులకు సంబంధించిన ఆధారాలు, ఇతర వివరా లు అన్ని విచారణ అధికారులకు అందజేసినట్లు విచారణ అనంతరం షేక్ సాబీర్ అలీ వెల్లడించారు. అట్రాసిటీ కేసు ఫిర్యాదుదారులు, కేసు కాకుండా మధ్యవర్తికి ద్వారా ముడుపులు అప్పగించిన వారిని కూడా పోలీసులు త్వరలో విచారించనున్నట్లు తెలుస్తుంది. సదరు మధ్యవర్తి విచారణకు హాజరయ్యే ముందు తనపై పోలీసులు కేసు పెట్టి రిమాండ్ చేసే అవకాశం ఉందని వీడియో విడుదల చేశాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్


సీజ్ చేసిన వాహనాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్లకోట సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం సోమవారం తెలిపారు. గ్రామంలోని కోట ప్రాం తంలో కొందరు వ్యక్తులు ఎక్స్‌కావేటర్ యంత్రంతో మట్టిని తీస్తూ రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వాహనాలను స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రామచంద్రం హెచ్చరించారు.

శ్రీరాముడి విగ్రహం ధ్వంసం

● మానేరు వంతెనపై బీజేపీ, హిందూ సంఘాల రాస్తారోకో

తంగళ్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దేవాలయంలో నెలకొల్పిన శ్రీరాముడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో తంగళ్లపల్లి మండలంలో రాస్తారోకో, ఆందోళనలతో ఉద్రిక్తత నెలకొంది. తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో గత శ్రీరామనవమి రోజు పూజలు నిర్వహించి సీతా, రామలక్ష్మణుల విగ్రహాలను తాత్కలికంగా నెలకొల్పారు. సోమవారం ఉదయం శ్రీరాముని విగ్రహం తల ధ్వంసమై ఉండడాన్ని స్థానికులు గమనించారు. గుడికి తాళం లేకపోవడం, ఎవరో ఉద్దేశపూర్వకంగానే శ్రీరాముని విగ్రహాన్ని ధ్వంసం చేశారని భావించారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావుతో పాటు బీజేపీ నాయకులు కేసీఆర్‌నగర్‌లోని ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు. విగ్రహం ధ్వసం చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ రామ్మోహన్ తన సిబ్బందితో చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయం మండలం మొత్తం వ్యాపించడంతో హిందూ సంఘాలు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు మానేరు వంతెనపై రాస్తారోకోకు దిగారు. సుమారు అరగంట పాటు రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సీఐ మొగిలయ్య, ఎస్‌ఐ రామ్మోహన్ చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.


రాస్తారోకో చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు

యూరియా కోసం బారులు


సారంగాపూర్ సహకార సంఘం వద్ద రైతులు

సారంగాపూర్, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఒక్కో రైతుకు ఆధార్‌కార్డుపై ఐదు బస్తాలను అందించారు. చాలా మంది రైతులకు యూరియా అందక పోవడంతో గంటల కొద్ది లైన్‌లో నిలబడి వెనుదిరిగారు. యూరియా కొరతపై సహకార సంఘం సీఈవో శివను వివరణ కోరగా సోమవారం రైతులు ఒక్కసారిగా రావడంతో కొరత ఏర్పడిందన్నారు. మంగళవారం మరో లారీ లోడ్ యూరియా వస్తుందని రైతుతు వచ్చి తీసుకెళ్లాలని వివరణ ఇచ్చారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ఎలిగేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొలాలకు ఎస్సారెస్పీ సాగునీరు అందడం లేదని సోమవారం ఎలిగేడు, లాలపల్లి ఆయకట్టు ప్రాంత రైతులు డి-86ప్రధాన కాలువ వద్ద ఆందోళన చేశారు. 13-ఎల్ ఉపకాలువ ద్వారా 55 ఎకరాల పైచిలుకు పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. నాట్లు వేసుకొని రోజులు గడుస్తున్నా తక్కువ నీరు రావడంతో సుమారు 25మంది రైతులు డి-86 ప్రధాన కాలువ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ డీఈ ఎండి.షిరాజ్, ఏఈలు అయాబ్, జెలని సమస్యను పరిష్కరిస్తామన్నారు. 13ఎల్ కాలువ తూములో గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లు వేయడంతో నీటి సరఫరా తక్కువైందని రైతులకు వివరించారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో తూముల్లో అడ్డుగా ఉన్నబండరాళ్లను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈడీఈ షిరాజ్ మాట్లాడుతూ కాలువల్లో అడ్డుగా బండలు వేసినా, తూములను ధ్వంసం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ముత్యల మల్లేశం, వెంగల్‌దాసు తిరుపతి, ముంజంపల్లి చిన్నసాయిలు, బావు రవీందర్, సప్పుల రవి ఉన్నారు.


సాగునీటికోసం డి86కాలువ వద్ద రైతులు

మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై కేసు

-ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని కోర్టులో పిటిషన్

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడనే ఫిర్యాదుపై కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై శనివారం కేసు నమోదైంది. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన పుల్లా రాజగౌడ్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని కోర్టులో పిటిషన్ వేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 25న కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు గంగాధర రమేష్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక తలుపు తొలగించి దొంగలు లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.3.46లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. రమేష్ కుటుంబ సభ్యులు ఆదివారం గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌కు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి చోరీ విషయం వెలుగులోకి వచ్చింది.

ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, మృతికి కారణమైన భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ అనే వ్యక్తి రమ్య అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్నప్పటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశాడు. భరించలేక వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. తన మేనకోడలు మృతికి భర్త కారణమంటూ మృతురాలి మేనమామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాయి కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- 13 ఏళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- పూర్తి కాక నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు




గుట్టపై వెలిసిన నర్సింహస్వామి

పూర్తయిన ఫార్మేషన్ రోడ్డు



ఘాట్ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం



నల్లగొండలో నర్సింహస్వామి గుట్ట

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్ష మెప్పుడు కలుగుతుందోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా మాఘ మాసంలో పౌర్ణమికి ముందు నాలుగు రోజుల పాటు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. 1967 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పుడు స్వామి వారి ఆదాయం 1800 రూపాయలు ఉండగా ప్రస్తుతం 60లక్షల రూపాయలకు చేరుకుంది. ఎత్తైన గుట్టపై స్వామి వారు వెలియడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా వెళ్లి మొ క్కులు చెల్లించుకుంటారు. గుట్టపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవ టానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవ డంతో ఆలయ ఫౌండరీ ఛైర్మన్ చెన్నాడి సత్యనారాయ ణరావు 1991-1993 సంవత్సరంలో గుట్ట కింద నర్సింహ స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామి వారిని ప్రతిష్ఠించారు. వివిధ రకాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విజయం చేకూర్చమని నర్సింహస్వామికి ముడుపులు కడతారు. పదవులు వచ్చాక ఘాట్ రోడ్డు నిర్మాణం మరిచి పోతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

2012లో పనులకు శంకుస్థాపన

2012లో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ఎంపీ 10లక్షల రూపాయలు, దేవాలయ నిధులు 30లక్షల రూపాయలతో ఫార్మేషన్ రోడ్డు చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగినట్లయితే భక్తుల రద్దీ పెరగటంతో పాటు ఆలయానికి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాలకు మధ్యలో కొడిమ్యాల మండలంలోని నల్లగొండ నర్సింహస్వామి ఆలయం ఉంది. గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, సైడ్ డ్రైనేజీ, సీసీ నిర్మాణం, రోడ్డుపై అవసరం ఉన్న చోట కల్వర్టుల నిర్మాణం, పైపుల ఏర్పాటు, కింది నుండి గుట్టపై వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులకు డార్మెటరీ హాల్, తాగు నీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత శాఖ అధికారులు నిధులు మంజూరు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ కళాశాల విద్యార్థి



జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన సాయిచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గడప సాయిచరణ్ అనే విద్యార్థి కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో భాగంగా అగ్రహారం డిగ్రీ కళాశాల నంచి సాయిచరణ్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు జరగబోయే జాతీయ సమైక్యతా శిబిరంలో సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాల్లో సాయిచరణ్ పాల్గొంటాడని తెలిపారు. సాయిచరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శారద, శకుంతల అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెద్దపులి ఆనవాళ్లు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుకార్లను నమ్మవద్దని, పులి సంచారంపై ఎలాంటి సమాచారం ఉన్నా తెలుపాలని ప్రజలను కోరారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై ఐదు రోజుల క్రితం పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందగా అటవీ అధికారులు మండలంలోని బొల్లోనిచెరువు. కొండాపూర్, నల్లగొండ శివారులను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో పెద్దపులి ఆనవాళ్ల కోసం తిరుగుతున్నారు. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, నూకలమర్రి శివారులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులను, వ్యవసాయ కూలీలను, పశువుల కాపరులను పెద్దపులి ఆనవాళ్లపై వివరాలు తెలుసుకున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో డీఆర్వో ముషీర్ అహ్మద్, బీట్ అధికారులు అశ్విని, ఆనందరావు, వసీం, ప్రవీణ్, మహేందర్, వాచర్లు ఐదు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతాన్ని నాలుగు బృందాలుగా విడిపోయి పరిశీలిస్తున్నారు. అడవిలో సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో కొడిమ్యాల అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి పోయినట్లుగా అటవీ అధికారులు భావిస్తున్నారు.

సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలు..

- సీపీకి ఫిర్యాదు చేసిన మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై గత 3 రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ వి రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ 43వ డివిజన్ అధ్యక్షుడు నవాజ్ హుస్సేన్‌లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర మేయర్ వై సునీల్‌రావు సోమవారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఫోటోలతో అసభ్యకరంగా, పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్నవారిపై చర్యలు తీఉకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేసి విచారణ జరిపించాలి

సుభాష్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ధరణి 13బి ద్వారా అక్రమ పట్టాలను రద్దు చేసి, దానిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్, కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలకు చెందిన తమ భూములను గత 30 సంవత్సరాలుగా తామె సాగుచేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా ఒక వ్యక్తి అప్పటి జమ్మికుంట తహసీల్దార్ కన్నం నారాయణ ద్వారా ఎలాంటి విచారణ చేయకుండా తమ కుటుంబ సభ్యులు, బంధువులపేరుపై 13బి పట్టాలు పొందారని ఆరోపించారు. ఆయన తరువాత వచ్చిన తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్ళామని ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంతకాలు ఫోర్జరీ చేసి చర్చికి అంబేడ్కర్ భవనంకు స్థలం ఇచ్చినట్లుగా చూపుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంపత్, శ్రీనివాస్, కొండయ్య పాల్గొన్నారు.

వేములవాడ క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- స్వామి వారి దర్శనానికి నాలుగంటల సమయం



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి బారులు తీరారు. ఆది దేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు కోడెమొక్కు క్యూలై న్‌లో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని మొక్కు లు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు అభిషేక పూజలో పాల్గొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మహా లింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సోమవారంను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉదయం స్వామి వారికి మమన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు చేపట్టారు. సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో లింగార్చనంలో దీపా లను వెలిగించి మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో పలుకుబడికి పెద్దపీట

- ఎక్స్ వేదికగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తుడు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలో నిబంధనలుకు విరుద్ధంగా పలుకుబడి ఉన్న ఓ పెద్ద మనిషికి ప్రాముఖ్యత ఇవ్వడం విమర్శలకు దారితీసింది. రాజన్న ఆలయంలో ప్రతి సోమవారం ఉదయం నిర్వహించే నిత్యపూజలు, అలంకరణ పూర్తి కాకముందే స్వామి వారితో పాటుగా అమ్మవారిని దర్శించుకుంటున్న తీరు ప్రస్తుతం వేములవాడలో చర్చనీయంశంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం నాలుగు గంటలకు స్థానికులకు ఉచిత దర్శనం అవకాశం ఉంది. స్థానికేతరుడైన అతను తన కుటుంబీలకతో కలిసి స్వామివారి గర్భగుడిలో గంటల తరబడి పూజలు చేస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తికి పూజారులు దగ్గరుండి మరీ పూజలు నిర్వహిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఎదురువుతున్నాయి.

సోమవారం ఉదయం రాజన్న ఆలయ గర్భగుడిలో అతను పూజలు నిర్వహిస్తుండగా స్థానిక భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఓ భక్తుడు రాజన్న ఆలయ ఈవోకు వాట్సప్‌లో, జిల్లా కలెక్టర్, సీఎంవోకు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆలయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు

- ప్రారంభించనున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి



క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కరీంనగర్ క్రీడా కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలోని 12 క్రీడావేదికలపై 29 క్రీడ అంశాలలో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లోని క్రీడా మైదానంలో డీజీపీ ఇంటెలిజెన్సీ తెలంగాణ శివధర్ రెడ్డి ప్రారంభించనున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని సీటీసీ, హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్, సీపీటీసీ, కరీంనగర్ క్లబ్, జీఎస్ అకాడమీ, అలుగునూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

రూ.7, 150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 29మంది రైతులు 324 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 21క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యూజీసీ గైడ్ లైన్స్ వెనక్కి తీసుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ గైడ్ లైన్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ గైడ్‌లైన్స్ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే వీసీలుగా నియమించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

గేట్ పడితే పడిగాపులు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



చేగుర్తికి వెళ్లే దారిలో రైలు గేటు పడటంతో నిరీక్షిస్తున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ నుంచి చేగుర్తికి వెళ్లే దారిలో రైల్వే గేటు పడిన ప్రతిసారి వాహనదారులు, గ్రామస్థులు పడిగాపులుకాస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు పడే గేటు తరచూ పడుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ మీదుగా రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతోపాటు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతున్నారు. మరోవైపు బొగ్గు, ఎరువులు, గ్రానైట్ గూడ్స్ రైళ్ల ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటాయి. దీంతో రోజుకు 10 నుంచి 12 సార్లు గేటు పడుతోంది. నాయకులు, అధికారులు స్పందించి ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ మార్గదర్శకాలు తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియని, యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కోల్పేయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించిన యూజీసీ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతోందన్నారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ జిట్ట బాలకృష్ణ తెలిపారన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించేలా మార్గదర్శకాలు ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాసే చర్యగా కనిపిస్తోందని వెల్లడించారు.

చివరి ఆయకట్టుకు చేరని మిడ్‌మానేరు నీరు

- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు



పెర్కపల్లి వద్ద నిలిచిన కాలువ నీరు



వెన్కేపల్లి శివారులో ఎండిపోతున్న మొక్కజొన్న చేనును చూపిస్తున్న రైతు

సైదాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్, సైదాపూర్, జాగీర్‌పల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి గ్రామాలకు కాలువ ద్వారా మిడ్ మానేరు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పంటలు ఎండుతున్నా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలంలో పంటలు సుభిక్షంగా పండాలని ముందుగానే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మానేరు కాలువకు నిధులు విడుదల చేసినప్పటికీ చివరి వరకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పెర్కపల్లి గ్రామం వరకు నీరు వచ్చి ఆగుతుందని, అక్కడి నుంచి మిగతా ప్రాంతాలకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు కిందికి నీటిని వదులడం లేదని రైతులు పేర్కొంటున్నారు. నీరు చివరి ఆయకట్టు వరకు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు మా గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

మొక్కజొన్న ఎండుతోంది



\- ఏనుగుల మహేందర్, రైతు, వెన్కేపల్లి

సైదాపూర్ శివారులో నేను నాలుగెకరాల మొక్కజొన్న సాగు చేశాను. కానీ నీరు లేకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ ద్వారా నీరు విడుదల చేయాలి.

నీరులేక పంటలు ఎండుతున్నాయి



\- మెడవేన రాజు, రైతు, గుజ్జులపల్లి

నేను గుజ్జులపల్లి శివారులో మూడెకరాల వరకు పల్లి చేను వేశాను. నీరు లేకపోవడంతో పూర్తిగా ఎండుతుంది. అధికారులు మిడ్ మానేరు నీరు కాలువ ద్వారా విడుదల చేసి పంటలను కాపాడాలి.

అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా



\- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాలకు మిడ్ మానేరు నీరు రావడం లేదని నా దృష్టికి వచ్చింది. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

స్థానిక ఎన్నికలకు తప్పని నిరీక్షణ !

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేశారు. మొదట మండలానికి ఒక గ్రామంలో ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, చెక్కులు అందజేశారు. మిగతా గ్రామాల్లో మార్చి నెలాఖరు లోపు ఈ నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ ఫలాలను అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో సోమవారం నుంచి జమ చేస్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంపికైన కూలీలకు ఈ సీజన్‌కు వారి ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమ చేయనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 13682 కుటుంబాలను రేషన్ కార్డులకు ఎంపిక చేసింది. వీళ్లే కాకుండా మరో 15 వేల కుటుంబాలు తమకు రేషన్ కార్డులు కావాలని దరఖాస్తులు చేసుకొ న్నారు. వారికి కూడా రేషన్ కార్డు అందించేందుకు వారి అర్హతలపై విచారణ జరుపనున్నారు. ఈ పథకాల ద్వారా ఆయా వర్గాలకు మార్చి నెలాఖరు వరకు లబ్ధి చేకూరనున్నది. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే బాగుంటుందనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తున్నది. బీసీ రిజర్వేషన్ల చిక్కుముడులు తెంచుకొని ఏప్రిల్ లేదా జూన్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది. అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులు తమ జేబులకు చిల్లులు పడకుండా చూసుకోవాల్సిందే.

ఎన్టీపీసీ స్టేజ్2కు నేడు ప్రజాభిప్రాయ సేకరణ

5వ పేజీ తరువాయి

కల్పించాలని, ప్రభావిత గ్రామాలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని, నిర్వాసితులు, స్థానికులకు తెలంగాణ ప్రాజెక్టులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో ఎన్టీపీసీ యాజమాన్యం తమ నిర్ణయాలను, కార్యచరణపై స్పష్టత ఇచ్చిన తరువాతనే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనట్టైతే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకంటామన్నారు. మంగళవారం ఎన్టీపీసీ బందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. బంద్ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చందర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మాతంగి కాలనీ, కందనపల్లి, మల్యాలపల్లి, బద్రిపల్లి, అక్బర్‌నగర్ ప్రజలను తరలించాలని కోరుతున్నారు.

రక్తదానం మహాదానం

పాలకుర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ ఆర్ స్వామిలు అన్నారు. సోమవారం బసంత్‌నగర్ టోల్‌ప్లాజా, ఎన్‌హెచ్ బ్లడ్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ వెంకటేశ్వరరావు టీమ్, హెచ్‌కెఆర్, ఫైర్ వాయిస్ సంయుక్తంగా రహదారి భద్రతోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ యువత రక్తదానంలో ముందుండాలని పిలుపునిచ్చారు. హెచ్‌కెఆర్ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, ప్లాజా మేనేజర్ కన్న బాబు, ఏపీఎంలు, పీఆర్‌వో రాము, హెచ్ఆర్ సుజిత్, పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, ధ్రువపత్రాలను అందించారు.

అవార్డులు అందుకున్న మండల ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష గణతంత్ర వేడుకల్లో ప్రశంసపత్రాలు అందజేశారు. మండల ఏపీవో రమేష్‌బాబు, కాపులపల్లి కార్యదర్శి అంజద్‌పాష, నిట్టూరు కార్యదర్శి శరత్‌బాబు, అప్పన్నపేట కార్యదర్శి శ్రీలత, పెద్దపల్లి సింగిల్ విండో కార్యాలయం సీఈవో మధు, సబ్బితం ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఏఈవో సువర్చల, ఏపీఎం సంపత్‌లకు జిల్లా కలెక్టర్ ప్రశంసపత్రాలు అందించారు.

మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు



మదర్‌థెరిస్సా కళాశాలలో ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం

పెద్దపల్లి రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ ఎడ్యూనెట్ ఆధ్వర్యంలో ఐబీఎం కంపెనీ స్కిల్ బిల్డ్ వర్క్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్ అశ్వినికుమార్ మాట్లాడుతూ కళాశాలలో ఐబీఎం స్కిల్‌బిల్డ్ ప్రోగ్రాంకు అత్యాధునిక ప్రయోగశాలలు కల్పించారని సంతృప్తి వ్యక్తంచేశారు. కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ ఏ. నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పి.పవన్ కుమా ర్, వెంకటేశ్వర్లు, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో కుక్ పోస్టులకు ఆహ్వానం

ధర్మారం జనవరి 27 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. ఆసక్తి, అనుభవం గల మహిళలు ఈ నెల 29 వరకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెడ్ పోస్టుకు పదో తరగతి, అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడవ తరగతి చదివి ఉండాలని ఆయన పేర్కొన్నారు.

పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు


పదోన్నతి పొందిన వారికి చిహ్నాన్ని అలంకరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు వస్తుందని, ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీస్‌ను పూర్తి చేయాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం పదోన్నతి పొందిన పది మంది ఏఎస్ఐలు, ఇద్దరు ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లను సీపీ అభినందించి, పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. ఆయన మాట్లాడుతూ బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు.

విద్యార్థులందరికి అపార్ కార్డు తప్పనిసరి

ధర్మారం జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరికి అపార్ కార్డు తప్పనిసరి అని ఎంఈవో పోతు ప్రభాకర్ అన్నారు. సోమవారం నందిమేడారం గురుకుల పాఠశాలల్లో అపార్ నమోదుకు ప్రత్యేక కాంపును ఏర్పాటు చేశారు. అనంతరం అపార్ ఐడి నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై ఆపరేటర్లకు సూచించారు. యుగేంధ్ర లక్ష్మి, విద్యాసాగర్, కుమార స్వామి పాల్గొన్నారు.

ఎంఈవోపై ఫిర్యాదు

ముత్తారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన ఎంఈవో, అడవిశ్రీరాంపూర్ హెచ్ఎం ఓదేలుపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన నిర్వాహకుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మధ్యాహ్న భోజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ మాట్లాడుతూ పదేళ్ళుగా మార్కెట్లో కోడిగుడ్ల ధర 6 నుంచి 7 రూపాయలుగా ఉందన్నారు. కానీ ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుందని, ఈ విషయమై అనేక సార్లు అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

అలాగే సత్యసాయి ట్రస్టు రాగి జావా పౌడర్‌ను పాఠశాలలకు అందిస్తున్నదని, వారికి రవాణా చార్జీల కింద 1.50 పైసలు ప్రభుత్వం చెల్లిస్తుం ది కానీ, జావా చేసేందుకు మధ్యాహ్న భోజన కార్మికు లను ఉచితంగా చేయాలని వేధింపులకు గురి చేస్తున్నా రన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్కెట్ ధరలకు అనుగుణంగా డబ్బులు ఇవ్వడంతో పాటు గౌరవ వేతనం 10 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. గొల్లపల్లి రజిత, కుల కళావతి, నూనేటి రాధమ్మ, రేణుక, రాజ్ కుమార్, గుమ్మడి వరలక్ష్మి, జంగం లక్ష్మి, పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

యూజీసీ నిబంధనను వెనక్కి తీసుకోవాలి



ఇని పీజీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన

కోల్‌సిటీటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించే యూజీసీ నిబంధనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలో నిరసన తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ ప్రభుత్వం యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు పాల్పడుతుందని అందులో భాగంగానే యూజీసీ నిబంధనలకు తెర లేపిందని, వైస్ ఛాన్సలర్‌లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాలకు విద్యార్థులు సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు. ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయిఆజాద్, రామగుండం నగర కార్యదర్శి ఎల్కపెల్లి సురేష్, నగర అధ్యక్షుడు మాతంగి సాగర్, సంజయ్ పాల్గొన్నారు.

తాజుద్దీన్ బాబా జన్మదిన వేడుకలు


ఖనిలో సందల్ ఊరేగింపు

కళ్యాణ్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హజ్రత్ తాజుద్దీన్ బాబా జన్మదిన వేడుకలను సోమవారం గోదావరిఖని పట్టణంలో నిర్వహించారు. కాకతీయ నగర్‌లోని దర్బార్‌లో నిర్వాహకులు నారదాసు సతీష్‌రావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ప్రధాన చౌరస్తా నుంచి సందల్ గంధంతో ఊరేగింపు నిర్వహించారు. సప్తగిరి కాలనీలోని దర్గా నుంచి రెడ్డి బాబా ఆధ్వర్యంలో ఊరేగింపును నిర్వహించారు. మంగళవారం పుణ్య వచనం, భజన ఉంటాయని సతీష్‌రావు పేర్కొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలను మంజూరు చేయాలి

ఓదెల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలను మంజూరు చేయాలని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కనగర్తిలో గ్రామంలో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, భూస్వాములకు రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనర్హులకు పథకాలను వర్తింపజేశారని తెలిపారు. నిజమైన పేదలకు పార్టీలకతీతంగా పథకాలను వర్తింపజేసేందుకు సర్వే నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామానికి చెందిన పురుషోత్తం ప్రభాకర్ (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలం పనుల విషయంలో ప్రభాకర్ అతడి భార్య రమాదేవి మధ్య గొడవ జరిగింది. దీంతో రమాదేవి ఈనెల 26న మంగపేట గ్రామమైన తల్లిగారింటికి వెళ్లింది. ప్రభాకర్ భార్యను తీసుకువచ్చేందుకు అత్తగారింటికి వెళ్లగా ఆమె రాలేదు. ప్రభాకర్ ఇంటికి వచ్చి మనస్తాపంతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మృతుడి భార్య రమాదేవి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా మాకు ఇల్లులేక గుడిసెలో ఉండి ఇబ్బంది పడుతున్నామని, ఇటీవల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు రాగా మాకు ఇల్లు రాకపోవడంతో నాభర్త మనస్థాపానికి గురై మృతి చెందినట్లు ఆమె పేర్కొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్


సంప్రీత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సంప్రీత్ టేబుల్ టెన్నిస్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యార్థి సంప్రీత్‌ను కలెక్టర్ అభినందించారు. ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ రాజయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, కోచ్ సత్యనారాయణ తెలిపారు.

సహస్రను సన్మానించిన బీజేపీ నేతలు

గర్రెపల్లి గ్రామానికి చెందిన పసెడ్ల సహస్ర ఇటీవల కిలిమంజారో పర్వతారోహణకు వెళ్లి స్వదేశానికి వచ్చిన సందర్భంగా బీజేపీ నేతలు ఆమెను సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సాహసాలు చేసి తల్లిదండ్రులకు మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నాయకులు నల్లవెళ్లి శంకర్, సంతోష్, ఇగురం రామస్వామి,పసిడ్ల రాజు, పాల్గొన్నారు.

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన గర్రెపల్లికి చెందిన సహస్రను, జాతీయస్థాయిలో పాల్గొన్న కుందేళ్ళ అభిలాష్, దీకొండ వినయ్‌కుమార్ రాష్ట్రస్థాయిలో పాల్గొన్న జాగిరి పూజిత, కోచ్ దీకొండ శివరామకృష్ణను బీజేపీ జిల్లా నాయకుడు జెట్టి శ్రీనివాస్ గర్రెపల్లి స్టేజీ వద్ద సోమవారం సన్మానించారు.

మాతంగి కాలనీని తరలించాలి

జ్యోతినగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు వల్ల కాలుష్యానికి గురవుతున్న మాతంగి కాలనీని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారికి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టును ఆనుకుని ఉన్న మాతంగి కాలనీలో సుమారు 150 కుటుంబాలు ఉంటున్నాయని తెలిపారు. బూడిద, బొగ్గు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేజ్ 2 కింద నిర్మించేందుకు ఎన్టీపీసీ సిద్ధమైందన్నారు. పునరావాసం కల్పించాలని, నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎన్.బిక్షపతి, రవీందర్, గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ స్కీమ్ విధానం ప్రభుత్వం తీసుకురావడం సరైందికాదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ(టీఎస్) రామగుండం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి తాండ్ర ప్రేమ్‌కుమార్, పర్లపెల్లి రఘుబాబు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని వారు పేర్కొన్నారు. తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చినట్లు పాత పెన్షన్ విధానాన్ని పునరుధ్ధరించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంట రామన్న, మండల కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలిగేడు: పీఆర్‌టియుటీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో సీపీఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తహసీల్దార్ ఎండి.బషీరోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. మిట్టపల్లి యుగంధర్, చంద్రమౌళి, శ్రీధర్ పాల్గొన్నారు.

ముత్తారం: పాత పెన్షన్ అమలు చేయాలని పిఆర్‌టియు టీఎస్ మండల అధ్యక్షుడు మారెల్లి శ్రీని వాస్ రెడ్డి తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుపతి, శ్రీధర్, తిరుపతి, సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏకీకృత పెన్షన్ స్కీం యుపీఎస్ అమలు చేయాలని నిర్దేశించిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయుటీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ వాసంతికి వినతి పత్రం అందజేశారు. రమేష్, శ్రీనివాస్, సతీష్, సతీష్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నాం

కళ్యాణ్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నామని పర్యావరణ పరిరక్షణ సమితి కార్యకర్త ఉమామహేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుడారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో థర్మల్ పవర్, సిమెంట్, రసాయనాల, సింగరేణి సంస్థల ద్వారా వెదజల్లుతున్న కాలుష్యంతో బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో భూములు సేకరించిన ఎన్టీపీసీ ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆరోపించారు. రెండు జిల్లాలో యేటా వందల మంది ఊపిరితుత్తులు, క్యాన్సర్, మూత్రపిండాలు, చర్మ వ్యాధులతో మృతి చెందుతున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో పందిళ్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ ప్రారంభం

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలోని పోచమ్మ దేవాలయం ఆవరణలో ధర్మశాస్త్ర వేదిక ఆధ్వర్యంలో ఉచిత ఇడ్లీ సాంబర్ పంపిణీని ప్రారంభించారు. వ్యవస్థాపకుడు కౌటం బాబు సేవలను ప్రశంసించారు. మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు చల్లా రవీందర్‌రెడ్డి, నారాయణదాసు మారుతీ, పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్స్, కార్పెట్స్ వితరణ

ధర్మారం జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెరుకపల్లి గ్రామ యువకులు పాఠశాలకు ఉపయోగపడే సామగ్రిని సోమవారం అందజేశారు. స్పీకర్‌ను పిట్టల సత్యం, రెండు కార్పెట్లను కాలువ రాజు అందజేశారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌తోపాటు ఉపాధ్యా యులు సన్మానించారు. శంకర్, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు జాకబ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా కళాకారుడు దివంగత జాకబ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం న్యూఅశోక థియేటర్ ఎదుట శంకుస్థాపన చేశారు. ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి, నాయకులుదీటి బాలరాజు, వేల్పుల నారాయణ, మైసరాజేష్, మాదాసు రామమూర్తి, కనకరాజులు జాకబ్ సేవలను కొనియాడారు.

వెంకట్రావ్‌పల్లెను కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వెంకట్రావ్‌పల్లె గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రాన్ని అందజేశారు. బుర్ర ముత్యాలు, శీలారపు లక్ష్మణ్, ఆవుల ఓదేలు, సుధాకర్, మల్లయ్య ఉన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీపై సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణకు పద్మశ్రీ రావడంపై సోమవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. తెలంగాణ చౌరస్తాలో డప్పులు వాయిస్తూ, బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ కన్వీనర్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. ముప్పై ఏళ్ళుగా అనేక ఆటుపోట్లు, కుట్రలకు ఎదురొడ్డి ఉద్యమాన్ని నడిపిస్తున్న మందకృష్ణ కార్యదక్షతకు పద్మశ్రీ నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రమౌళి, బాలంకుస్, ఇరుగురాల కిష్టయ్య, బీజేపీ నాయకులు మూకిరి రాజు, సారంగపాణి, రాజేందర్, శివ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై ఎంఎస్‌పీ మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ కన్నూరి ధర్మేందర్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు.

జూలపల్లి: మందకృష్ణ మాదిగను సోమవారం హైదారాబాద్‌లో పెద్దపల్లి జిల్లా ఉపసర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అడువాల తిరుపతి పటేల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎలిగేడు: అంబేద్కర్‌చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యిగొంతుకలు, లక్షడప్పులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీనివాస్, జల్లి రమేష్‌లు పిలుపునిచ్చారు. న్యాతరి పోచయ్య, శంకర్, పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మందకృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం హర్షనీయమని వక్తలు కొనియాడారు. మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మందకృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.



పరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలి

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసిపి-2 ప్రాజెక్టు విస్తరణకు సేకరించిన లద్నాపూర్ గ్రామంలోని మిగిలిన గృహాలకు పరిహారం చెల్లించిన అనంతరమే పనులు ప్రారంభించాలని బాధితుడు బడికెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన 104 ఎకరాల భూసేకరణ పూర్తి కాగా అవార్డులో పేరు రాలేదని శ్రీనివాస్ ఆరోపించారు. అనేక మార్లు సింగరేణి అధికారుల దృష్టికి తీసికెళ్ళినట్లు పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌కు 100 మీటర్ల దూరంలో తన ఇల్లు ఉందని, బ్లాస్టింగ్ రాళ్లు ఇంటి సమీపంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇంటితోపాటు మరో పది గృహాలు ఉన్నాయని పేర్కొన్నాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నిర్వాసిత గ్రామ ప్రజలు రోడ్డశ్రీనివాస్, రాజన్న, శంకర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ట్రైనీలకు శిక్షణా తరగతులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సోమవారం నిమ్ శిక్షణా కేంద్రంలో ఇండక్షన్ శిక్షణా తరగ తులు ప్రారంభమయ్యాయి. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తరగతులను ప్రారంభించారు. రెండు వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు జీఎం పేర్కొన్నారు. శిక్షణను సద్వినియో గం చేసుకోవాలని, సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలని అభ్యర్థులకు జీఎం సూచించారు. ఏజీఎం(ఐఈ) వెంకయ్య, నిమ్ డీజీఎం హుస్సేనీ, సింటార్స్ డీజీఎం విజయ్‌కుమార్‌తో పాటు 34 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం


యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు ప్రెసిడెంట్ వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ సంఘాలు సింగరేణి కార్మికుల హక్కులను సాధించడంలో విఫలమైనందున టీబీజీకేఎస్ ఏర్పడిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులను సాధిం చిందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరన్న, అధికార ప్రతినిధి పార్లపల్లి రవి, సీనియర్ నాయకులు కనకం శాంసన్, చల్ల రవీందర్ రెడ్డి, పోలీసు శ్రీనివాసరావు, దూట శేషగిరి, గోపి, పల్లె సురేందర్, వరాల జోసెఫ్, పులిపాక శంకర్, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ శ్రేణులు నిర్వహించాయి. ఆర్జీ-2 యూనియన్ ఆఫీస్ ఆవరణలో డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ జండాను ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమం, మెరుగైన వైద్యానికి చారిత్రాత్మక ఒప్పందాలు చేసుకున్నామన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, సురేందర్, అనిల్‌రెడ్డి, రవితేజ, తిరుపతి, హరిప్రసాద్, పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యం


మాట్లాడుతున్న మారుపేర్ల సంఘం అధ్యక్షుడు

గోదావరిఖని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మారుపేర్ల నెపంతో ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం కాలయాపన చేస్తుందని, యాజమాన్యం దిగి రాకపోతే ఆత్మహత్యలే శరణ్యమని మారుపేర్ల సంఘం అధ్యక్షుడు శ్రావణ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగాలు ఇవ్వాలని మూడేళ్ళుగా ప్రభుత్వాలను వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. గోలేటి నుంచి ఇల్లందు వరకు తలపెట్టిన యాత్రను ఫిబ్రవరి 3న గోలేటిలో ప్రారంభిం చనున్నట్టు ఆయన తెలిపారు. శ్రీనివాస్, రాజు, వెంకటేష్, సుధాకర్, పాల్గొన్నారు.